క్లుప్తంగా

విద్యార్థులు బాధ్యతగా నడుచుకోవాలి



నందిగామ రూరల్: విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజంలో నడుచుకోవాలని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. పట్టణంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక దుష్పభావాలు ఉంటాయని, అంతే కాకుండా మానసిక, శారీరక ఇబ్బందులు కలుగుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో చోరీ



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఇంజం మేధిని కంటి శస్త్రచికిత్స కోసం 10 రోజుల కిందట ఇంటికి తాళాలు వేసి విజయవాడ వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి పక్కన వారు చూసే సరికి వెనుక డోరు పగుల కొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్, సిబ్బందితో పాటు క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ చోరీ ఘటనలో రూ.30 వేల నగదు, అర కిలో వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు మేధిని కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎస్ఎస్‌జీ బృందం పర్యటన



జగ్గయ్యపేట: మండలంలోని బండిపాలెం, చిల్లకల్లు, అనుమంచిపల్లి, గండ్రాయి గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృంద సభ్యులు మంగళవారం పర్యటించారు. గ్రామాలలో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సభ్యులు శివ, శ్రీనివాస్. సందీప్, సుధీర్‌లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు గంటల పాటు గ్రామాలలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాలలో డీఎల్పీవో రాఘవన్, ఎంపీడీవో నితిన్, డెప్యూటీ ఎంపీడీవో పద్మావతి, కార్యదర్శులు జగ్గయ్య, శివాజీ, శ్రావణ్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మిట్టగూడెం ప్రాంతంలో ఇటీవల ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పర్యటించిన సమయంలో స్థానికులు తాగునీటి సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ తులసి కృష్ణారావులను పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన పైప్‌లైన్ పనులను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య పరిశీలించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, నాయకులు గింజుపల్లి కృష్ణ, ఏలూరు క్రాంతి పాల్గొన్నారు.

నేడు విజన్- 2047పై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047పై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జరుగుతుందని ఎంపీడీవో నితిన్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్ అధ్యక్షతన జరుగుతుంది. జగ్గయ్యపేట, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొనాలని కోరారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం కష్టం



పెనుగంచిప్రోలు నుంచి వేమవరం వెళ్లే దారిలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

- నరకయాతన పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెనుగంచిప్రోలు: మండలంలో ఆర్ అండ్ బీ రోడ్లు ఛిద్రమవటంతో ప్రయాణం కష్టతరంగా మారింది. పలు ప్రధాన రహదారులు వర్షాలకు చిన్నపాటి సెలయేటిని తలపిస్తున్నాయి. పెనుగంచిప్రోలు నుంచి మక్కపేట, పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వరకు నిత్యం వేలాది మంది భక్తులు శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి పెనుగంచిప్రోలు వస్తుంటారు. రహదారి మొత్తం గుంతలు పడి వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారింది. గత ఏడాది మునేరు వరదలకు పెనుగంచిప్రోలు నుంచి వేమవరం, పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాలకు వెళ్లే రహదారులు పూర్తిగా కొట్టుకు పోవటంతో తాత్కాలికంగా కంకర, మట్టి వేసి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వర్షాలకు రాళ్లు, మట్టి కొట్టుకు పోయి గుంతలు పడి వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు ఉండటంతో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు నుంచి మక్కపేట వెళ్లే దారిలో రహదారిపై ఏర్పడిన గుంతలు

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయండి

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు

రావిరాల(జగ్గయ్యపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలిచ్చి రాష్ట్రాన్ని 13 నెలల్లోనే అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. ఏపీ అభివృద్ధిని సినిమా గ్రాఫిక్స్‌ల్లా చూపుతున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలను టీడీపీ నాయకులకే అమలు చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పథకాలపై ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు కూటమి చేసే మోసాలను వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, గ్రామ నాయకులు తోట రాంబాబు, నల్లమట్టి హరీష్, ఇనుపనుర్తి ఏలియా, తదితరులు పాల్గొన్నారు.



రావిరాలలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తన్నీరు

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ

వత్సవాయి: చంద్రబాబునాయుడిని నమ్మితే మోసపోవడం గ్యారెంటీ అని ఎన్నోసార్లు రుజువు అయిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని లింగాల, శింగవరం, చిట్టేల గ్రామాలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎలాగైనా అధికారం దక్కించుకోవాలనే ఆలోచనతో జనసేన, బీజేపీ పార్టీలతో జట్టుకట్టి అలవికాని హామీలను ప్రజలకిచ్చి అధికారంలోనికి వచ్చారన్నారు. తీరా అధికారంలోనికి వచ్చిన తరువాత ఎన్నికలలో ప్రజలకిచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం వైఎస్సార్ సీపీ నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు పెడుతూ సంతోషపడుతున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. జిల్లా పార్టీ నాయకులు లేళ్ల నాగేంద్రరెడ్డి, రూప్లానాయక్, గ్రామపార్టీ నాయకులు కనకచందరరావు, అంబోజీ జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు



కొణతాలపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న రమేష్ బాబు, ముత్తారెడ్డి

గ్రామ కమిటీల నియామకం

వీరులపాడు: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని అవసరమైతే తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే ట్రూఅప్ చార్జీల పేరుతో పేద ప్రజల నడ్డి విరిచేలా విద్యుత్ చార్జీలను పెంచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడు, కొణతాలపల్లి, వెల్లంకి, దాచవరం గ్రామాలలో మంగళవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించారు.

గ్రామ కన్వీనర్‌ల నియామకం..

మండలంలోని కొణతాలపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా శీలం జానకిరామిరెడ్డి, వెల్లంకి గ్రామ కన్వీనర్‌గా వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, దాచవరం గ్రామ కన్వీనర్‌గా తోట పవన్‌కుమార్, దొడ్డదేవరపాడు గ్రామ కన్వీనర్‌గా తోట నారాయణ, వీరులపాడు గ్రామ కన్వీనర్‌గా సూర్యదేవర వినయ్‌కుమార్‌లను నియమించినట్లు రమేష్ బాబు, ముత్తారెడ్డి తెలిపారు. వీరితో పాటు గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు నంద్రు సౌజన్య, గద్దె వెంకటేశ్వర్లు, కన్నమాల సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు అయిలూరి వెంకట్రావమ్మ, వేమిరెడ్డి కోటేశ్వరీ, ఉప సర్పంచ్ ఐలూరి నర్సిరెడ్డి, ఉద్దండు రెడ్డి, నాయకులు నువ్వుల విశ్వనాథం, శీలం నరేందర్ రెడ్డి, తోట హరీష్, రత్న ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జగ్గయ్యపేట అర్బన్: సంక్షేమ పాలన అందించడంతో ఘోరంగా వైఫల్యం చెందిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డుల్లోని తొర్రగుంటపాలెంలో మంగళవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజలు వెల్లువెత్తుతుండటంతో పాటు ప్రజలకు కూటమి పాలనలోని వైఫల్యాలను, వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తుండంతో తట్టుకోలేని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ ప్రజల దృష్టిని మళ్లించే కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చల్లా సుశీల, నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు ధరావత్ శ్యామల, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, స్థానిక నాయకులు దేవరశెట్టి వీరాంజనేయులు, దారెల్లి రాజు, షేక్ ఖాదర్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తొర్రగుంటపాలెంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఫిరోజ్‌ఖాన్, పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వెంకయ్య మృతి బాధాకరం

నందిగామ రూరల్: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గర్మిడి రామకృష్ణ (బుల్లి వెంకయ్య) (55) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బుల్లి వెంకయ్య అకాల మృతి బాధాకరమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గర్మిడి నరసింహారావు, బొల్లినేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో సాయంత్రం 4.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 25 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణను, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మి కంపోస్ట్ పిట్స్, ప్లాస్టిక్ ష్రెడ్డర్ పనితీరు, డ్రై వేస్ట్ నిర్వహణ, చెత్త సేకరణ వాహనాలను తనిఖీ చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్, క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించారు. ఇటీవలి కాలంలో పంచాయతీ కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్, విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సునీత శర్మ, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో విస్తృత తనిఖీలు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో బస్సుల కండీషన్, రికార్డుల నిర్వహణపై విజయవాడ జోన్-2 డెప్యూటీ మెకానికల్ ఇంజినీర్ బి.హారిక విస్తృత తనిఖీలు నిర్వహించారు. రెండు రోజులుగా జరిగిన తనిఖీలు మంగళవారంతో ముగిశాయి. వెహికల్ కండీషన్ మెరుగు పరిచేందుకు అవసరమైన సామగ్రి వినియోగాన్ని, గ్యారేజీ రికార్డులను పరిశీలించారు. పలు బస్సులను రోడ్డు టెస్ట్ చేశారు. వెహికల్స్ పరిశుభ్రత, జీరో బ్రేక్ డౌన్ సాధించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలు కానున్న నేపథ్యంలో ఆర్టీసీ సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. ఆమె వెంట డిపో మేనేజర్ వేణు, సిబ్బంది ఉన్నారు.

డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

వీరులపాడు: మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ మంగళవారం మండలంలోని జుజ్జూరు తోట మూల వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాల య్యాయి. మలుపు వద్ద కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూనిఫాం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని జూనియర్ కళాశాలకు చెందిన 52 మంది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా వితరణతో యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) చేతుల మీదుగా కుమార్‌రాజా యూనిఫాంను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, గింజుపల్లి కృష్ణ, స్కూల్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఆర్డీవో బాలకృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: ఎరువులకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసినా, అధిక ధరలకు అమ్మినా సహించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ ఎరువుల షాపుల యజమానులను హెచ్చరించారు. మంగళవారం జగ్గయ్యపేట పట్టణంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అమ్మే దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గ్రోమోర్ కంపెనీ, శ్రీప్రియా ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణాలలో తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ పాయింట్‌ను, షాపు రెన్యూవల్, ఈ– పాస్ రికార్డులను పరిశీలించారు. గ్రోమోర్ కంపెనీలో ఈ– పాస్‌లో అరటన్ను తేడా రావడాన్ని గుర్తించారు. దానికి సంబంధించి ఈ రోజు స్టాక్ అమ్మకాన్ని ఎంట్రీ చేయకపోవడంతో తేడా ఉన్నట్లు గుర్తించి వెంటనే వాటిని కూడా ఈ–పాస్‌లో ఎక్కించాలన్నారు. శ్రీప్రియా ఫెర్టిలైజర్స్ షాపులో కొన్ని కంపెనీలకు సంబంధించి అమెన్మెంట్ రెన్యూవల్ చేయకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఫెర్టిలైజర్స్ షాపులో డీఏపీ యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వేరొకటి కొంటేనే డీఏపీ యూరియా అమ్ముతామని రైతులపై ఒత్తిడి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంవత్సరం నుంచి పర్యావరణం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి 12 శాతం నానో యూరియాను ఖచ్చితంగా రైతులకు అవగాహన కల్పించి అమ్మాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టర్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఏడీఏ సి.భవానీ, ఏవో వరలక్ష్మి, జగ్గయ్యపేట ఆర్ఐ సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో షాపుల్లో తనిఖీ చేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

డీపీఓ లావణ్యకుమారి

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పి. లావణ్యకుమారి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే– 2025లో భాగంగా మంగళవారం ముండ్లపాడు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. గ్రామాలు చెత్త రహితంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిలిపి వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఎంపీడీవో కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ గుంటుపల్లి వాసు, కేంద్ర బృంద సభ్యులు డి.చందు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ లావణ్యకుమారి

విధుల నిర్వహణలో అలసత్వం వహించొద్దు

డీఎల్‌పీవో రాఘవన్

బండిపాలెం(జగ్గయ్యపేట): గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని విజయవాడ డీఎల్‌పీవో రాఘవన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్యాలయానికి వచ్చే వారితో మమేకమై మాట్లాడటంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వెల్ఫేర్, ఇంజినీరింగ్ అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని చెప్పారు. వర్షాకాలం కావటంతో గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాల్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జగ్గయ్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్పీవో

కళాకారులు ప్రజలను జాగృతపరచాలి

నందిగామ రూరల్: ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించేలా కళాకారులు ప్రజలను జాగృతపరచాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జీవీ రంగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాకవి వడ్లమూడి నాగేశ్వరరావు 101వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా వడ్లమూడి చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా ప్రజానీకాన్ని చైతన్యపరచటానికి దోహదపడాలన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కళాకారులకు గుర్తింపు కార్డులు, ప్రదర్శనల బకాయిలు అందించాలని కోరారు. అనంతరం ప్రజా నాట్యమండలి మండల కన్వీనర్‌గా దామోదర్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, గోపీనాయక్, తదితరులు పాల్గొన్నారు.



వడ్లమూడి చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న నాయకులు

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

కీసర(కంచికచర్ల): మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ నరసింహారావు అన్నారు. మండలంలోని కీసరలో తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంగళవారం పలు స్థలాలను గుర్తించారు. ఈమేరకు ఏఈ మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరయ్యాయని అన్నారు. గ్రామంలో పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టేందుకు రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో ఏయే ఏరియాలో పైప్‌లైన్లు అవసరమో ఆ స్థలాలను గుర్తించి విస్తరణ పనులు చేపడతామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సిఫారసు మేరకే మత్తు మందులు అమ్మాలి

నందిగామ టౌన్: వైద్యుల సిఫారసు మేరకే మత్తు మందులను విక్రయించాలని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. పట్టణంలోని మందుల దుకాణాల యజమానులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచన మేరకు కాకుండా ఇష్టారీతిన మత్తు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌లో లభించే మత్తు మందులకు యువత బానిసలవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కొందరు దుకాణదారులు మత్తు మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం ఉందని, అటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.